

డెల్టాలకు నీరు విడుదల

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి మంగళవారం తూర్పు డెల్టాకు 4,500, మధ్య డెల్టాకు 2 వేలు, పశ్చిమ డెల్టాకు 5 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు.



రూ.50 వేల విరాళం

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహుని ఆలయంలో నిత్యాన్నదానానికి శిఖా శ్రీనివాసరావు, నాగమణి దంపతులు (అమలాపురం మండలం పేరూరు) మంగళవారం రూ.50 వేల విరాళం సమర్పించారు.

ఇతరులకు అన్నదానం.. నో



సత్యదేవుని నిత్యాన్న ప్రసాద పథకం(అన్నదానం)లో ఇకపై భక్తులు మినహా ఇతరులెవ్వరూ భోజనం చేయడానికి వీలు లేదు. ఈ మేరకు అన్నవరం దేవస్థానం ఈఓ ఎస్ఎస్ చంద్ర శేఖర్ అజాద్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

8లో

న్యూస్‌రీల్

జేసీగా నుపూర్ అజయ్ బాధ్యతల స్వీకరణ



కలెక్టర్ హిమాన్షు శుక్లాకు పుష్పగుచ్ఛం అందిస్తున్న నూతన జేసీ నుపూర్ అజయ్

అమలాపురం రూరల్: జిల్లా జాయింట్ కలెక్టర్‌గా ఎస్.నుపూర్ అజయ్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. జిల్లా జేసీల్లో ఆమె రెండో వారు కాగా, తొలి మహిళా జేసీ. తొలుత ఆమె కలెక్టర్ హిమాన్షు శుక్లాను మర్యాదపూర్వకంగా కలిశారు. మహారాష్ట్రకు చెందిన నుపూర్ అజయ్ 2018 బ్యాచ్ ఐఏఎస్ అధికారి. ఇప్పటి వరకూ రాష్ట్ర భూపరిపాలన ముఖ్య కమిషనర్ కార్యాలయంలో సంయుక్త కార్యదర్శిగా పని చేసిన ఆమె బదిలీపై జిల్లా జేసీగా వచ్చారు. ఆమెకు జిల్లా రెవెన్యూ అధికారి సీహెచ్ సత్తిబాబు, కలెక్టరేట్ పరిపాలనాధికారి కాశీ విశ్వేశ్వరరావు, పౌర సరఫరాల శాఖ జిల్లా మేనేజర్ ఎస్.సుధాసాగర్, డీఎస్ఓ ఎ.పాపారావు, డీఈఓ కమలకుమారి, జిల్లా వ్యవసాయ అధికారి ఎ.బోసుబాబు, సర్వే, ల్యాండ్ రికార్డ్స్ ఏడీ ప్రభాకర్, గ్రామ/వార్డు సచివాలయాల నోడల్ అధికారి భీమేశ్వరరావు తదితరులు ఘన స్వాగతం పలికారు.

36 గ్రామాల్లో వరద బాధితులకు నిత్యావసరాలు



పెదకందాలపాలెంలో వరద బాధితులకు బియ్యం, నిత్యావసర సరకులు పంపిణీ చేసిన కలెక్టర్ హిమాన్షు శుక్లా, జేసీ నుపూర్ అజయ్

పి.గన్నవరం: జిల్లాలోని 36 గ్రామాల్లో వరద బాధితులకు బియ్యం, నిత్యావసర సరకులు అందిస్తున్నామని కలెక్టర్ హిమాన్షు శుక్లా తెలిపారు. నాగుల్లంక గ్రామంలోని పెదకందాలపాలెం, గుడ్డాయలంక, పల్లిపాలెం, కాట్రగడ్డ ప్రాంతాలకు చెందిన 1,369 కుటుంబాలకు 25 కిలోల బియ్యం, కిలో కందిపప్పు, లీటర్ పామాయిల్, కిలో ఉల్లిపాయలు, కిలో బంగాళాదుంపల చొప్పున నిత్యావసర సరకుల కిట్లను కలెక్టర్ శుక్లా, జేసీ ఎస్.నుపూర్ అజయ్ మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వరద బాధితులు, వృద్ధులు, విద్యార్థులతో కలెక్టర్ మాట్లాడారు. నిత్యావసర సరకుల నాణ్యతను పరిశీలించారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ, బాధితులందరికీ బియ్యం, నిత్యావసర సరుకుల పంపిణీని గురువారం సాయంత్రంలోగా పూర్తి చేస్తామన్నారు. కాజ్‌వేలు, రోడ్లు వరద నీట మునగడంతో 36 గ్రామాలకు సంబంధాలు తెగిపోయాయని తెలిపారు. వరద తగ్గిన అనంతరం ఇతర మండలాల నుంచి సిబ్బందిని తీసుకు వచ్చి, ప్రత్యేక టీమ్‌లతో లంక గ్రామాల్లో వ్యాధుల నివారణకు ప్రత్యేక పారిశుధ్య చర్యలు చేపడతామని వివరించారు. రేయింబవళ్లు శ్రమించి వరద బాధితులకు చిత్తశుద్ధితో సేవలందించిన తహసీల్దార్లు, ఎంపీడీఓలు, మండల స్థాయి అధికారులను, వివిధ శాఖల సిబ్బందిని, వలంటీర్లను కలెక్టర్ అభినందించారు. కార్యక్రమంలో ఎంపీపీ అంబటి భూలక్ష్మి, మండల ప్రత్యేక అధికారి తిక్కా వెంకటేశ్వర్లు, తహసీల్దార్ జి.రవీంద్రనాథ్ ఠాగూర్, సర్పంచ్ యల్లమెల్లి కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

తల్లి పాలతో పిల్లల్లో రోగ నిరోధక శక్తి

కొత్తపేట: తల్లి పాలతో పిల్లల్లో రోగ నిరోధక శక్తి పెరుగుతుందని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి (డీఎంహెచ్ఓ) డాక్టర్ ఎం.దుర్గారావు దొర అన్నారు. తల్లి పాల వారోత్సవాల ప్రారంభం సందర్భంగా వానపల్లి పీహెచ్‌సీలో ఆశా కార్యకర్తలతో మంగళవారం ఆయన సమీక్ష నిర్వహించారు. పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ కేఎస్ఎస్‌బీ హర్ష అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ, పుట్టిన గంటలోపే బిడ్డకు కచ్చితంగా ముర్రుపాలు తాగించాలని అన్నారు. ముర్రుపాలు వ్యాధి నిరోధక శక్తిని పెంచుతాయన్నారు. వీటిలో శిశువు జీర్ణాశయ అభివృద్ధికి దోహదపడే విటమిన్-ఎ అధిక మోతాదులో ఉంటుందని చెప్పారు. బిడ్డను ఒడిలో పడుకోబెట్టుకుని పాలివ్వడం వలన తల్లి శరీరం నుంచి బిడ్డకు అవసరమైన వేడి అందుతుందన్నారు. తద్వారా ఇద్దరి మధ్య ఆప్యాయత, అనుబంధాలను పెంచేందుకు తల్లి పాలు దోహదపడతాయన్నారు. ఈ అంశాలపై తల్లులకు అవగాహన కల్పించాలని ఆశా కార్యకర్తలకు సూచించారు. వివిధ ఆరోగ్య అంశాలు, సీజనల్ వ్యాధులు తదితర అంశాలపై డీఎంహెచ్ఓ సమీక్షించారు. గ్రామంలో తల్లిపాల వారోత్సవాల ర్యాలీ నిర్వహించారు. అనంతరం వరద ముంపు ప్రాంతాల్లో పర్యటించి ప్రథమ చికిత్స కేంద్రాలను ఆయన తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ పి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మనమే నంబర్ 1

- జగనన్న సురక్షలో రాష్ట్రంలోనే జిల్లా ప్రథమం
- 7,65,694 సేవల అందజేత
- చిట్టచివరి లబ్ధిదారుకూ సంక్షేమమే లక్ష్యంగా నిర్వహణ

అమలాపురం రూరల్: ప్రజా సంక్షేమమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్న విషయం తెలిసిందే. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఏదో ఒక సంక్షేమ పథకం ద్వారా లబ్ధి చేకూర్చాలని త్రికరణశుద్ధిగా ఆయన తపన పడుతున్నారు. మునుపెన్నడూ ఎవ్వరూ చూడని విధంగా వినూత్న సంక్షేమ పథకాలను ఆయన సారథ్యంలోని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తోంది. అయితే, వీటి ద్వారా చాలా మంది లబ్ధి పొందుతున్నా.. ఇంకా కొంతమంది వివిధ కారణాలతో పలు పథకాలు, ప్రభుత్వ సేవలు అందుకోలేకపోతున్నారు. దీనిని గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం గడచిన నెల రోజులుగా 'జగనన్న సురక్ష' పేరుతో వినూత్న కార్యక్రమం చేపట్టింది.

ప్రత్యేక సర్వేతో గుర్తింపు

అర్హులై ఉండి, వివిధ ధ్రువీకరణ పత్రాలు లేక పథకాలు అందుకోలేకపోతున్న వారిని గుర్తించేందుకు గ్రామ/వార్డు వలంటీర్ల ద్వారా తొలుత ఏడు రోజులు ముందుగా ప్రత్యేక సర్వే నిర్వహించింది. వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు ఇంటింటా సర్వే చేసి, ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించి, సంబంధిత యాప్‌లో నమోదు చేశారు. ప్రజలకు అవసరమైన సేవలను గుర్తించారు. సాంకేతిక, ఇతర కారణాలతో ప్రభుత్వ పథకాల లబ్ధి పొందలేకపోతున్న అర్హులను గుర్తించారు. వీరందరికీ ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండానే.. తహసీల్దార్, ఎంపీడీఓ, ఈఓ పీఆర్‌డీలతో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి.. సచివాలయాల వారీగా జగనన్న సురక్ష సభలు నిర్వహించి, ప్రభుత్వం ఉచితంగా వివిధ ధ్రువీకరణ పత్రాలు, ఇతర సేవలు అందజేసింది. సచివాలయాల పరిధిలో జగనన్న సురక్ష శిబిరాలు నిర్వహించిన రోజుల్లో ప్రత్యేక క్యాంపులు నిర్వహించి, ఆధార్ కార్డులకు మొబైల్ నంబర్‌ను అనుసంధానం చేయడం వంటి సేవలు కూడా అందించారు. విమర్శకు తావు లేకుండా అత్యంత పారదర్శకంగా నూరు శాతం సంతృప్త స్థాయిలో సంక్షేమ పథకాలు, ప్రభుత్వ సేవలు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఈ కార్యక్రమం చేపట్టింది. దీని అమలులో రాష్ట్రంలోని 26 జిల్లాల్లోనూ కోనసీమ ప్రథమ స్థానంలో నిలిచింది. అధికార యంత్రాంగం, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పూర్తి సమన్వయంతో ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

7,80,029 టోకెన్ల జారీ

అర్హతలు ఉండి, అవసరమైన ధ్రువీకరణ పత్రాలు పొందలేక సంక్షేమ పథకాలను అందుకోలేకపోతున్న వారిని గుర్తించేందుకు మండల అధికారులు, సచివాలయ సిబ్బంది, గ్రామ/వార్డు వలంటీర్లు తొలుత సర్వే నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా 515 సచివాలయాల పరిధిలో ఈ సర్వే జరిగింది. దీని ద్వారా వివిధ సేవలు, ధ్రువీకరణ పత్రాలు అందించేందుకు 7,80,029 టోకెన్లు జారీ చేశారు. వీటిని మరోసారి పరిశీలించి, 7,65,694 పరిష్కరించారు. వీరికి సచివాలయాల వారీగా జగనన్న సురక్ష శిబిరాలు నిర్వహించి, అవసరమైన సేవలు, ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. తద్వారా జిల్లా రాష్ట్రంలోనే ప్రథమ స్థానం సాధించి, రికార్డు సృష్టించింది. పశ్చిమ గోదావరి జిల్లా 6,05,865 సేవలతో ద్వితీయ స్థానంలో నిలిచింది. మన జిల్లా 1,60,043 సేవలు అధికంగా అందించి, మొదటి స్థానం కైవసం చేసుకుంది.

నియోజకవర్గాల వారీగా అందించిన సేవలు

నియోజకవర్గం పేరు	మొత్తం సచివాలయాలు	ఇచ్చిన టోకెన్లు	అందించిన సేవలు
అమలాపురం	84	1,18,462	1,16,391
కొత్తపేట	87	1,13,451	1,11,713
మండపేట	76	1,33,434	1,30,255
ముమ్మిడివరం	63	1,10,759	1,09,114
పి.గన్నవరం	61	83,574	82,218
రామచంద్రపురం	56	85,974	83,863
రాజోలు	88	1,34,375	1,32,140



అమలాపురంలో జరిగిన జగనన్న సురక్ష శిబిరంలో ఇచ్చిన ధ్రువపత్రాలను చూపుతున్న లబ్ధిదారులు (ఫైల్)

జిల్లా వ్యాప్తంగా జగనన్న సురక్షలో అందించిన సేవలు

కుల ధ్రువీకరణ పత్రాలు	3,29,878
ఆదాయ ధ్రువీకరణ పత్రాలు	3,20,937
ఓబీసీ 1బి ధ్రువీకరణ	44,934
కంప్యూటర్ అడంగల్	22,284
ఇంటిగ్రేటెడ్ సర్టిఫికెట్స్ రీ ఇన్సూరెన్స్	20,085
ఆదాయ ధ్రువీకరణ (రీ ఇన్సూరెన్స్)	13,018
ఆధార్ కార్డులకు ఫోన్ నంబర్ అనుసంధానం	9,486
రేషన్ కార్డులో కుటుంబ సభ్యుల చేర్పు	1,667
ఆధార్ కార్డుల కోసం అడ్రస్ సర్టిఫికెట్	609
కొత్త రేషన్ కార్డులు	450
రైస్ కార్డుల నుంచి కుటుంబ సభ్యుల విభజన	330
ఫ్యామిలీ మెంబర్ కార్డు సర్టిఫికెట్లు	284
ఆరోగ్యశ్రీ కార్డుల దరఖాస్తులు	251
హౌస్ హోల్డ్ మ్యాపింగ్ విభజన	219
రైస్ కార్డుల్లో అడ్రస్ మార్పు	242
మ్యుటేషన్లు, టైటిల్ డీడ్	107
బర్త్, డెత్ సర్టిఫికెట్ల లేట్ రిజిస్ట్రేషన్	98
రైస్ కార్డుల్లో సభ్యుల తొలగింపు	85
మ్యారేజ్ సర్టిఫికెట్లు	72
కొత్త ఆరోగ్యశ్రీ కార్డులు	66

ఇంటికే వచ్చి 1బి అడంగల్ ఇచ్చారు



1బి అడంగల్ కోసం తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరిగి ఇబ్బంది పడనవసరం లేకపోయింది. మా వలంటీర్ మా ఇంటికి వచ్చి, 1బి అడంగల్‌కు సంబంధించిన ఆధారాలు తీసుకుని, జగనన్న సురక్ష ద్వారా ఆ సర్టిఫికెట్ అందజేశారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన ఈ కార్యక్రమం ఇలా ఉపయోగపడటం చాలా సంతోషంగా ఉంది.

– బళ్ల నాగ సతీష్, విలసవిల్లి, ఉప్పలగుప్తం మండలం

అద్భుతంగా ఉంది



ప్రభుత్వ సంక్షేమ పథకంలో లబ్ధి పొందేందుకు కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు అవసరమయ్యాయి. జగనన్న సురక్ష సర్వేలో వలంటీర్ మా ఇంటికి వచ్చినప్పుడు ఈ విషయం చెప్పాను. సచివాలయ ఉద్యోగుల ద్వారా దరఖాస్తు చేసుకున్నాను. గ్రామసభలో ఆయా పత్రాలు చేతికందించారు. ప్రభుత్వ ధ్రువీకరణ పత్రాలు ఇంత సులభంగా అందుకోవడం అద్భుతంగా ఉంది.

–గులాబత్తుల వెంకట రమణ, కపిలేశ్వరపురం

సమష్టి కృషితో..



వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు, అధికారులు, ఉద్యోగులందరి సమష్టి కృషితోనే జగనన్న సురక్ష అమలులో రాష్ట్రంలోనే మొదటి స్థానం సాధ్యమైంది. ప్రభుత్వం పేర్కొన్న 11 రకాల పౌరసేవలతో పాటు అదనంగా తొమ్మిది రకాల సేవలు ఉచితంగా అందించాం. ఈ కృషిలో కీలక భూమిక పోషించిన అందరికీ అభినందనలు. భాగస్వాములైన ప్రజాప్రతినిధులకు ధన్యవాదాలు. సాంకేతిక, ఇతర కారణాలతో ప్రభుత్వ పథకాలు అందుకోలేని వారికి ఈ నెలలో నిర్వహించే బై యాన్యువల్‌లో లబ్ధి చేకూరుస్తాం.

– విలేకర్ల సమావేశంలో కలెక్టర్ హిమాన్షు శుక్లా

మరో 6 నెలలు..

- మళ్లీ త్రీమెన్ కమిటీలకే 'సహకార' పగ్గాలు
- జిల్లాలో 15 సంఘాలకు కొత్త ముఖాలు
- కోర్టు ఉత్తర్వులతో రెండు సంఘాలకు వర్తించని పొడిగింపు
- మిగిలిన 149 సంఘాలకూ పాత కమిటీలే కొనసాగింపు

అమలాపురం టౌన్: జిల్లాలోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల(పీఏసీఎస్)కు గతంలో నియమించిన త్రీమెన్ కమిటీలు, పర్సన్ ఇన్‌చార్జిల పదవీ కాలాన్ని మరో ఆరు నెలలు పొడిగిస్తూ రాష్ట్ర సహకార శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఉత్తర్వులు సోమవారం వచ్చాయని జిల్లా సహకార అధికారి ఎ.రాధాకృష్ణారావు తెలిపారు. పాత కమిటీల ఆరు నెలల పదవీ కాలం సోమవారంతో ముగిసిందన్నారు. ఈ నెల 1వ తేదీ నుంచి పదవీ కాలం పొడిగించిన కమిటీలు రానున్న ఆరు నెలల పాటు సంఘాలను నిర్వహిస్తాయని రాధాకృష్ణారావు వివరించారు. 95 శాతం సంఘాలకు పాత కమిటీలనే సహకార శాఖ కొనసాగించింది. జిల్లాలోని 166 సంఘాలకు గాను 15 సంఘాలకు కొత్తగా త్రీమెన్ కమిటీలను నియమించింది. కోర్టుకు సంబంధించిన లావాదేవీల వల్ల నగరం, ఈదరాడ సంఘాల కమిటీల పదవీ కాలం పొడిగింపు వచ్చే అక్టోబర్ నుంచి ఉంటుంది. మిగిలిన 149 సంఘాలకూ పాత కమిటీలనే కొనసాగిస్తున్నట్టు ఉత్తర్వుల్లో పేర్కొంది. జిల్లాలోని బండార్లంక, అమలాపురం, ఐ.పోలవరం, కోరుమిల్లి, కాలేరు, మండపేట, డి.కేశవరం, జెడ్.మేడపాడు, తాపేశ్వరం, వెలగతోడు, పాశర్లపూడిలంక, వన్నెచింతలపూడి, చెయ్యేరు, ఇందుపల్లి, కుడుపూరు సంఘాలకు మాత్రం కొత్తగా త్రీమెన్ కమిటీని, పర్సన్ ఇన్‌చార్జిని నియమించింది. ఈ కొత్త కమిటీల పదవీ కాలం ఆరు నెలలు ఉంటుంది. మిగిలిన సంఘాల్లో పాత కమిటీల పదవీ కాలాన్ని మరో ఆరు నెలలు పొడిగించింది. సహకార సంఘాల త్రీమెన్ కమిటీల పదవీ కాలాన్ని ఆరు నెలలకోసారి పొడిగిస్తూ రావడం ఇది ఏడోసారి. ఇలా పొడిగిస్తున్న ప్రతిసారీ కొన్ని సంఘాల త్రీమెన్ కమిటీలకు కొత్త ముఖాలు వస్తున్నాయి. మెజార్టీ సంఘాలకు పాత కమిటీలనే కొనసాగిస్తున్నారు.

భారీగా తగ్గిన వరద ఉధృతి

- తేరుకుంటున్న లంకలు
- ధవళేశ్వరం వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక ఉపసంహరణ
- ముమ్మరంగా సహాయ చర్యలు

సాక్షి, అమలాపురం: గోదావరి వరదలతో తల్లడిల్లిన లంక గ్రామాలు నెమ్మదిగా తేరుకుంటున్నాయి. గడచిన 24 గంటల్లో 3 నుంచి 5 అడుగుల మేర వరద తగ్గింది. ధవళేశ్వరం బ్యారేజీ నుంచి సోమవారం ఉదయం 5 గంటలకు 16.02 లక్షల క్యూసెక్కుల మిగుల జలాలను సముద్రంలోకి విడిచిపెట్టారు. అది మంగళవారం ఉదయం 5 గంటలకు 11.86 లక్షల క్యూసెక్కులకు తగ్గింది. అంటే 24 గంటల్లో ఎగువ నుంచి 4.16 లక్షల క్యూసెక్కుల మేర జలాల రాక తగ్గింది. బ్యారేజీ వద్ద తెల్లవారుజామున 5 గంటలకు గోదావరి నీటిమట్టం 13.70 అడుగులకు తగ్గడంతో రెండో ప్రమాద హెచ్చరికను, మధ్యాహ్నం 2 గంటలకు 11.70 అడుగులకు తగ్గడంతో మొదటి ప్రమాద హెచ్చరికను ఉపసంహరించారు. రాత్రి 7 గంటలకు నీటిమట్టం 10.60 అడుగులకు తగ్గింది. 8,17,758 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడిచిపెట్టారు. ఎగువన నీటిమట్టాలు తగ్గడంతో వరద ఉధృతి బుధవారం మరింత తగ్గనుంది.

లంక గ్రామాల్లోని మెరక ప్రాంతాలు ముంపు నుంచి బయట పడ్డాయి. లోతట్టు ప్రాంతాల్లోని ఇళ్లు, రోడ్లు, కాజ్‌వేలపై ఇంకా వరద నీరు ప్రవహిస్తోంది. పి.గన్నవరం మండలం కె.ఏనుగుపల్లిలో వరద తగ్గగా శివాలయంక, గంటి పెదపూడిలంకల్లో ముంపు కొనసాగుతోంది. మామిడికుదురు మండలం అప్పనపల్లి, అయినవిల్లి మండలం ముక్తేశ్వరం వద్ద ఎదురుబిడిం కాజ్‌వేలపై ఇంకా పడవల పైనే ప్రయాణాలు సాగిస్తున్నారు. అప్పనపల్లి, కోటిపల్లి మత్స్యకార కాలనీ, నడవపల్లి, పల్లంకుర్రు మత్స్యకార కాలనీ, అప్పరాముని లంక, టేకిశెట్టిపాలెం, సఖినేటిపల్లిలంక, బోడసకుర్రు పల్లిపాలేల్లో ఇళ్లు ఇంకా ముంపులోనే ఉన్నాయి.



సఖినేటిపల్లి మండలంలో ఇంకా ముంపులోనే ఉన్న అప్పనరామునిలంక ఓఎన్జీసీ కాలనీ

వారం రోజులుగా..

వారం రోజులుగా 10 మండలాల్లోని 30 గ్రామాలపై గోదావరి వరద ప్రభావం చూపింది. 3,175 కుటుంబాలకు చెందిన 10,612 మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. బాధితులకు భోజనం, తాగునీరు, చిన్నారులకు పాలు అందించారు. 76,903 భోజన పొట్లాలు, 2.06 లక్షల వాటర్ ప్యాకెట్లు, 20,480 లీటర్ల వాటర్ క్యాన్లు అందజేశారు. దశల వారీగా 32 పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశారు. ప్రజల రాకపోకలకు 174 బోట్లు అందుబాటులో ఉంచారు. మరో రెండు రోజుల్లో వరద పూర్తి స్థాయిలో తగ్గిన తరువాత, పి.గన్నవరం, మామిడికుదురు తదితర మండలాల్లో పంట నష్టాలు నమోదు చేయనున్నారు. ఇందుకు సంబంధించి ఇప్పటికే ఎన్యూమరేషన్ బృందాలను నియమించారు. గత ఏడాది మాదిరిగా నష్టాల అంచనాలు తయారు చేసి, పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం అందించనున్నారు. జిల్లాలో ఎక్కువగా ఉద్యాన పంటలు దెబ్బతిన్న విషయం తెలిసిందే. దీనిపై అధికారులు ఇప్పటికే ప్రాథమిక అంచనాలు రూపొందించారు. ఉద్యాన పంటలకు 2,350.60 హెక్టార్లలో రూ.5.32 కోట్ల మేర నష్టం వాటిల్లింది. సుమారు 6,042 మంది రైతులు నష్టపోయారు. ఇక వ్యవసాయ పంటలకు సంబంధించి 143 హెక్టార్లో వరి చేలు, 47 హెక్టార్లలో ఆకుమడులు దెబ్బ తిన్నాయి.

ప్రభుత్వ సాయం పంపిణీ

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ముంపు బాధిత కుటుంబాలకు వరద సాయం కిట్ల పంపిణీని జిల్లా యంత్రాంగం మంగళవారం ప్రారంభించింది. ఒక్కో కుటుంబానికి 25 కేజీల బియ్యం, కిలో కందిపప్పు, లీటర్ పామాయిల్, కిలో బంగాళాదుంపలు, కిలో ఉల్లిపాయలు ఉచితంగా అందిస్తున్నారు. లంక గ్రామాల్లోని రేషన్ దుకాణాల్లో ఇప్పటికే నిత్యావసర వస్తువులను అందుబాటులో ఉంచారు. మామిడికుదురు, పి.గన్నవరం, అయినవిల్లి, మలికిపురం, ముమ్మిడివరం తదితర మండలాల్లో కిట్ల పంపిణీ మొదలైంది. కొన్ని గ్రామాల్లో ఇళ్లను శుభ్రం చేసుకున్న తర్వాత నిత్యావసర వస్తువులు కావాలని వరద బాధితులు కోరారు. దీంతో వారు కోరినప్పుడే ఇవ్వాలని కలెక్టర్ హిమాన్షు శుక్లా అధికారులను ఆదేశించారు.

గర్భిణులకు గుడ్ న్యూస్

- వైఎస్సార్ సంపూర్ణ పోషణ ద్వారా నేటి నుంచి టేక్ హోం రేషన్
- పది రకాల సరకులతో ప్రత్యేక కిట్లు



జీవీ సత్యవాణి

మండపేట: అంగన్‌వాడీ కేంద్రాల్లోని గర్భిణులు, బాలింతలకు ప్రభుత్వం గుడ్ న్యూస్ చెప్పింది. వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకంలో భాగంగా టేక్ హోం రేషన్ (టీహెచ్ఆర్) కింద సరకుల పంపిణీకి నిర్ణయించింది. ఈ కార్యక్రమాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం లాంఛనంగా ప్రారంభిస్తారు. గర్భిణులు, బాలింతలు, ఆరేళ్ల లోపు చిన్నారుల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం పౌష్టికాహారం అందిస్తోంది. గతంలో ఇంటికే అందజేసిన ఈ సరకులు సక్రమంగా వినియోగానికి నోచుకోలేదు. దీంతో అంగన్‌వాడీ కేంద్రాల్లోనే వండి, వడ్డించే విధానం అమలు చేశారు. పలు కారణాలతో అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చి, తిని వెళ్లే వారి సంఖ్య తగ్గుతోందని గుర్తించిన ప్రభుత్వం సర్వే చేపట్టింది. ఇంటికే సరకులు పంపిణీ చేయాలని అధిక శాతం మంది కోరడంతో టేక్ హోం రేషన్ ప్రారంభించాలని నిర్ణయించింది. జిల్లాకు సంబంధించి దీని ప్రారంభ వేడుక కలెక్టరేట్‌లో జరగనుంది. అక్రమాలకు తావు లేకుండా ఫేస్ రికగ్నైజేషన్ సిస్టమ్ (ఎఫ్ఆర్ఎస్) ద్వారా సరకులు పంపిణీ చేయనున్నారు. ఆరు నెలల నుంచి మూడేళ్ల లోపు చిన్నారులకు కూడా టీహెచ్ఆర్ కింద సరకులు ఇస్తారు. టీహెచ్ఆర్‌కు విముఖత చూపే వారు పాత పద్ధతిలోనే అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చి భోజనం చేయవచ్చు.



వైఎస్సార్ సంపూర్ణ పోషణ టీహెచ్ఆర్ కిట్లు

జిల్లాలో ఐసీడీఎస్ ప్రాజెక్టులు	7
అంగన్‌వాడీ కేంద్రాలు	1,726
గర్భిణులు	9,072
బాలింతలు	7,837
మూడేళ్ల లోపు చిన్నారులు	40,314
మూడు నుంచి ఆరేళ్ల లోపు చిన్నారులు	40,047

ఇచ్చే సరకులివీ..

వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్‌లో 3 కిలోల బియ్యం, కిలో కందిపప్పు, అర లీటరు పామాయిల్, 5 లీటర్ల పాలు, 2 కిలోల చోడిపిండి, కిలో అటుకులు, పావు కిలో బెల్లం, పావు కిలో ఖర్జూరం, పావు కిలో వేరుశనగ చిక్కీలు, 25 కోడిగుడ్లు (12 గుడ్లు ఒకసారి, 15 గుడ్లు మరోసారి) ఇస్తారు. 6 నెలల నుంచి మూడేళ్ల లోపు చిన్నారులకు రెండున్నర కిలోల బాలామృతం, రెండున్నర లీటర్ల పాలు, 25 గుడ్లు ఇస్తారు. 3 నుంచి ఆరేళ్ల లోపు చిన్నారులకు అంగన్‌వాడీ కేంద్రంలో మధ్యాహ్న భోజనంతో పాటు ఉడకబెట్టిన కోడిగుడ్డు, 100 మిల్లీలీటర్ల పాలు అందజేస్తారు. టేక్ హోమ్ రేషన్‌ను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ, సాధికారత అధికారి జీవీ సత్యవాణి కోరారు.

ముంచకుండానే.. ముందుచూపుతో..

- వరదలకు ముందే పశుగ్రాసం సిద్ధం చేసిన అధికారులు
- కలెక్టర్ ఆదేశాలతో ఏప్రిల్‌లోనే ఎండుగడ్డి నిల్వ
- అధికార యంత్రాంగం చొరవతో పాడిరైతులకు తప్పిన ఇబ్బందులు

కొత్తపేట: సాధారణంగా జూలై, ఆగస్టు నెలల్లో గోదావరికి వరదలు వస్తుంటాయి. ఆ సమయంలో అందరి దృష్టి ప్రజల ఇబ్బందుల పైనే ఉంటుంది. కానీ వరద ముంపుతో వ్యవసాయ, ఉద్యాన పంటలు ధ్వంసమై, లంక గ్రామాల్లోని పశువులకు గ్రాసం దొరకక పాడి రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతుంటారు. రబీ వరి కోతల అనంతరం నిల్వ చేసిన ఎండుగడ్డి ఈ వరదల సమయంలో రైతులకు ఎంతో ఉపయోగపడుతుంది. లంక గ్రామాల్లోని పాడి రైతులు తమ పశువులను తమ భూముల్లోనే మేపుతారు. అక్కడే పశుగ్రాసం పెంచుతారు. వరదలను దృష్టిలో ఉంచుకుని పాడి రైతులు ముందుగానే పచ్చి, ఎండుగడ్డి వంటి పశుగ్రాసం సిద్ధం చేసుకుంటూ ఉంటారు. కానీ, గత ఏడాది ఊహించని విధంగా జూలైలో గోదావరికి తీవ్ర స్థాయిలో వరదలు వచ్చాయి. దీంతో లంక భూముల్లోని పశుగ్రాసం ముంపునకు గురైంది. ఆ ప్రాంతాల్లోని పశువులను ఉన్న పళాన ఏటిగట్ల పైకి, సురక్షిత ప్రాంతాలకు తోలుకు వచ్చారు. ఆ సమయంలో పశుగ్రాసం కొరత తీవ్రంగా ఏర్పడింది. అప్పట్లో వెంటనే స్పందించిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వరద ప్రభావిత లంక ప్రాంతాలకు పశువులకు అవసరమైన మేరకు సమీకృత దాణా దిగుమతి చేసి, యుద్ధప్రాతిపదికన పాడి రైతులకు సరఫరా చేసింది. వరదలు తగ్గిన తరువాత అప్పట్లో పరిస్థితి చక్కబడింది.

రబీ వరి కోతల అనంతరం..

ఈ అనుభవంతో కలెక్టర్ హిమాన్షు శుక్లా ఈసారి ముందే స్పందించారు. వరదల సమయంలో పశువులు ఆకలితో అలమటించకూడదనే ఉద్దేశంతో వాటికి అవసరమైన పశుగ్రాసాన్ని ముందుగానే నిల్వ చేయించాలని నిర్ణయించారు. ఈ మేరకు గత ఏప్రిల్ నెలలో రబీ వరి కోతల అనంతరం చేలల్లోని ఎండుగడ్డిని పోగు చేయించే బాధ్యతను ఆయా మండలాల తహసీల్దార్లకు అప్పగించారు. ఆ మేరకు వారు తగినంత వరి గడ్డి సేకరించి, ఆయా లంక గ్రామాల పరిధిలో ముందుగానే నిల్వ చేయించారు. కొత్తపేట, రావులపాలెం, ఆలమూరు, ఆత్రేయపురం, పి.గన్నవరం, మామిడికుదురు, అయినవిల్లి, అంబాజీపేట, ముమ్మిడివరం, కాట్రేనికోన, ఐ.పోలవరం, అమలాపురం, అల్లవరం, కపిలేశ్వరపురం, కె.గంగవరం, రాజోలు, సఖినేటిపల్లి, మలికిపురం మండలాల్లోని 72 గ్రామాల పరిధిలో ఉన్న 125 లంక ప్రాంతాల్లో 24,673 ఆవులు, గేదెలు ఉన్నాయి. వీటికి వరదల సమయంలో అందించే లక్ష్యంతో 134 మెట్రిక్ టన్నుల ఎండుగడ్డిని ముందుగానే అధికార యంత్రాంగం సేకరించింది. దీనిని రోలింగ్ చేయించి, కట్టలుగా కట్టించి నిల్వ చేశారు. ప్రస్తుత వరదల సమయంలో ఆ గడ్డిని పశువులకు సరఫరా చేస్తున్నారు. అలాగే ప్రభుత్వం జిల్లాకు ఇప్పటికే 200 మెట్రిక్ టన్నుల సమీకృత దాణా అందించింది. దీనిని పాడి రైతులకు పంపిణీ చేస్తున్నామని పశు సంవర్ధక అధికారులు తెలిపారు.

పశుగ్రాసం నిల్వ చేశారిలా..

పశుగ్రాసం సరఫరా చేసిన వరద ప్రభావిత లంక గ్రామాలు	125
వాటిల్లో పశువులు	24,673
నిల్వ చేసిన ఎండుగడ్డి	134 మెట్రిక్ టన్నులు
సిద్ధం చేసిన సమీకృత దాణా	200 మెట్రిక్ టన్నులు



అంబాజీపేట మండలం గంగలకుర్రులో ఎండుగడ్డి సేకరణను పర్యవేక్షిస్తున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా (ఫైల్)



కొత్తపేట మండలం వానపల్లిలో ఎండుగడ్డి పంపిణీ చేస్తున్న తహసీల్దార్ కిషోర్‌బాబు, నాయకులు

పాడి రైతులకు పంపిణీ



గోదావరి వరద ప్రభావిత ప్రాంతాల పశువులకు అందించేందుకు కలెక్టర్ ఆదేశాల మేరకు రెవెన్యూ శాఖ ద్వారా సేకరించి, నిల్వ చేసిన ఎండు గడ్డిని పాడి రైతులకు పంపిణీ చేస్తున్నాం. ప్రభుత్వం సమీకృత దాణా కూడా అందజేసింది. దీనిని కూడా రెండు రోజుల్లో పంపిణీ చేస్తాం. ఇంకా అవసరమైతే ఇండెంట్ పెట్టి దిగుమతి చేసుకుంటాం. – డాక్టర్ ఎల్.అనిత, సహాయ సంచాలకులు, పశు సంవర్ధక శాఖ, ఆలమూరు

క్లుప్తంగా

వందేభారత్‌కు సామర్లకోటలో హాల్ట్


వంగా గీత

కాకినాడ: విశాఖపట్నం – సికింద్రాబాద్ – విశాఖ పట్నం మధ్య నడుస్తున్న వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలుకు సామర్లకోట జంక్షన్‌లో హాల్ట్ ఇచ్చేందుకు గ్రీన్ సిగ్నల్ పడింది. దీనిపై కాకినాడ ఎంపీ వంగా గీత చేసిన ప్రయత్నాలు ఫలించాయి. రైల్వే శాఖ మంత్రి అశ్విన్ వైష్ణవ్‌ను ఎంపీ గీత ఇటీవల కలిసి వందేభారత్ రైలుకు సామర్లకోటలో హాల్ట్ ఇవ్వాలని వినతి పత్రం అందించారు. దీనికి రైల్వే మంత్రి అందుకు అంగీకరించారు. సామర్లకోటలో హాల్ట్‌కు ఆదేశాలు ఇచ్చారు. ఈ మేరకు రైల్వే బోర్డు జాయింట్ డైరెక్టర్ వివేక్ కుమార్ సిన్హా మంగళవారం అధికారికంగా ఉత్తర్వులు ఇచ్చారు. వారం రోజుల వ్యవధిలోనే సామర్లకోట జంక్షన్‌లో ఈ రైలును ఆపేందుకు రైల్వే శాఖ ఏర్పాట్లు చేయనుంది. రైల్వే మంత్రి అశ్విన్ వైష్ణవ్‌కు ఎంపీ గీత కృతజ్ఞతలు తెలిపారు. ఈ రైలుకు ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో రాజమహేంద్రవరంలో మాత్రమే హాల్ట్ ఉంది. సామర్లకోట నుంచి రాజమహేంద్రవరం రైల్వే స్టేషన్‌కు వెళ్లాలంటే ప్రయాణికులకు గంటన్నర పడుతుంది. ఇప్పుడు ఉమ్మడి జిల్లాలో ఈ రైలుకు రెండో హాల్ట్ సామర్లకోట ద్వారా సాకారమవుతోంది. సామర్లకోట హాల్ట్ వలన కాకినాడ జిల్లా ప్రయాణికులకు ఎంతో వెసులుబాటు కలగనుంది. సమయం, వ్యయం ఆదా కానున్నాయి.

వివాహిత ఆత్మహత్య

తాళ్లరేవు: ఓ వివాహిత ఆత్మహత్యకు పాల్పడింది. కోరంగి ఎస్సై పి.శ్రీనివాస కుమార్ మంగళవారం తెలిపిన వివరాల ప్రకారం.. పెదవలసల గ్రామానికి చెందిన కస్తూరి మహాలక్ష్మి(20)కి, రామన్నపాలేనికి చెందిన పంతాడి నూకరాజుకు 2021లో వివాహమైంది. వారికి 11 నెలల కుమారుడు కలిగాడు. కుమారుడి పుట్టిన రోజు వేడుక చేసేందుకు బుధవారం ఏర్పాట్లు కూడా చేసుకుంటున్నారు. పెయింటింగ్ వర్క్ చేసుకుంటూ జీవించే నూకరాజుకు, భార్య మహాలక్ష్మికి తరచూ గొడవలు జరిగేవి. అతడితో పాటు అత్తమామలు, ఆడపడుచు తదితరులు అదనపు కట్నం కోసం వేధించేవారని చెబుతున్నారు. గొడవల నేపథ్యంలో పుట్టింటికి వెళ్లిన మహాలక్ష్మి వారం రోజుల కిందటే అత్తవారింటికి వచ్చింది. ఏం జరిగిందో ఏమో కానీ, ఇంట్లో ఎవరూ లేని సమయంలో రామన్నపాలెంలోని తన ఇంట్లో మహాలక్ష్మి ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. భర్త వచ్చి చూసేసరికే మృతి చెందినట్లు చెబుతున్నారు. బాధితురాలి తల్లి పోతాబత్తుల ధనలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై శ్రీనివాస కుమార్ తెలిపారు.

సాగుబడిలో దేశీ సేవ

- విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల డీలర్లకు శిక్షణ
- వ్యవసాయ సాంకేతిక పరిజ్ఞానంపై తరగతులు
- పరిశోధన కేంద్రాల ద్వారా ప్రయోగాత్మక విజ్ఞానం అందజేత
- వారే రైతులకు మార్గదర్శకులయ్యేలా ప్రభుత్వాల ప్రయత్నం

కొత్తపేట: అత్యధిక శాతం రైతులు సాగులో మొట్టమొదటిగా విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల డీలర్ల సలహాలు, సూచనలే తీసుకుంటారు. వారు చెప్పిన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులనే వినియోగిస్తారు. వారంటే అంత నమ్మకం. అయితే, ఆ డీలర్లలో చాలా మందికి తగినంత వ్యవసాయ పరిజ్ఞానం ఉండటం లేదు. దీంతో రైతులు నష్టపోతున్న సందర్భాలుంటున్నాయి. దీనిని గుర్తించిన కేంద్ర ప్రభుత్వం ఈ డీలర్ల(వ్యవసాయ – ఇన్‌పుట్ డీలర్లు)కు అవసరమైన పరిజ్ఞానం అందించడం ద్వారా వ్యవసాయ విజ్ఞానవంతులుగా తీర్చిదిద్దాలని నిర్ణయించింది. ఇది తగినంత పెట్టుబడితో నాణ్యమైన, అధిక దిగుబడులు సాధించేందుకు, తద్వారా వ్యవసాయంలో ఒక పెద్ద మార్పునకు దోహదపడతాయని భావించింది.

పారా ఎక్స్‌టెన్షన్ ప్రొఫెషనల్‌గా..

కేంద్ర వ్యవసాయ శాఖ గణాంకాల ప్రకారం దేశంలోని సుమారు 2.82 లక్షల మంది వ్యవసాయ డీలర్లు ఉన్నారు. వీరిని పారా ఎక్స్‌టెన్షన్ ప్రొఫెషనల్‌గా తయారు చేసేందుకు కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ డిప్లొమా ఇన్ అగ్రికల్చరల్ ఎక్స్‌టెన్షన్ సర్వీసెస్ ఫర్ ఇన్‌పుట్ డీలర్స్ (దేశీ) పేరుతో కోర్సు రూపొందించింది. వీరికి ఏడాదిలో 48 రోజుల పాటు రాయితీతో కూడిన శిక్షణ ఇస్తారు. ఈ దేశీ ప్రోగ్రామ్‌ను నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అగ్రికల్చర్ ఎక్స్‌టెన్షన్ మేనేజ్‌మెంట్ (మేనేజ్) కొన్నేళ్ల క్రితం ప్రారంభించింది. ఈ శిక్షణను రాష్ట్ర వ్యవసాయ నిర్వహణ, విస్తరణ శిక్షణ సంస్థల (సమేటి) ద్వారా వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ (ఆత్మ) జిల్లాల్లో నిర్వహిస్తుంది. దీనికి వ్యవసాయ శాఖ సహాయ సంచాలకుల స్థాయి రిటైర్డ్ అధికారులను ఫెసిలిటేటర్లుగా నియమిస్తారు. వారితో పాటు ప్రస్తుత అధికారులు, శాస్త్రవేత్తలతో డీలర్లకు ఈ శిక్షణ ఇప్పిస్తున్నారు. ఏడాది శిక్షణకు రూ.20 వేలు ఫీజు కాగా 50 శాతం రాయితీ ఇస్తున్నారు. బ్యాచ్‌కు 40 మంది చొప్పున ఈ శిక్షణ ఇస్తున్నారు. దేశంలోని పలు రాష్ట్రాలతో పాటు ఆంధ్రప్రదేశ్‌లో కూడా గతంలోనే దేశీ కార్యక్రమం ప్రారంభమైనప్పటికీ పురోగతి అంతంత మాత్రమే. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధికారం చేపట్టాక రైతు ప్రోత్సాహక, సంక్షేమ పథకాలతో పాటు దేశీ ప్రోగ్రామ్‌పై కూడా దృష్టి పెట్టారు. ప్రతి డీలర్‌కూ దేశీ శిక్షణ ఇప్పించి వారిని 'పారా ఎక్స్‌టెన్షన్ ప్రొఫెషనల్'గా తయారు చేయాలని సీఎం ఆదేశించారు. దీంతో ఎక్కువ బ్యాచ్‌లకు శిక్షణ ఇస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో..

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో ఆత్మ ద్వారా డీలర్లకు శిక్షణ ఇస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో సుమారు 1,650 మంది డీలర్లుండగా ఇప్పటి వరకూ 15 బ్యాచ్‌లలో 600 మందికి శిక్షణ ఇచ్చారు. కొత్తపేట వ్యవసాయ సబ్ డివిజన్‌తో పాలు వివిధ మండలాలకు చెందిన 40 మంది డీలర్లకు గత ఏడాది మే నెలలో శిక్షణ ప్రారంభం కాగా, స్థానిక వ్యవసాయ కార్యాలయంలో జూలై 26వ తేదీ వరకూ 40 థియరీ క్లాసులు నిర్వహించారు. మధ్యలో మరో 8 రోజుల పాటు ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లోని వివిధ వ్యవసాయ, ఉద్యాన పంటల పరిశోధన కేంద్రాలకు తీసుకువెళ్లి, వ్యవసాయ సాంకేతికతపై ప్రయోగాత్మకంగా శిక్షణ ఇచ్చారు. జూలై 26న తుది పరీక్ష నిర్వహించారు. వారికి త్వరలోనే సర్టిఫికెట్లు అందజేస్తామని ఆత్మ అధికారులు తెలిపారు. ప్రస్తుతం పిఠాపురం, రాజమహేంద్రవరాల్లో రెండు బ్యాచ్‌లకు శిక్షణ ఇస్తున్నామని చెప్పారు.


పందిరిమామిడి ఉద్యాన పరిశోధన స్థానంలో డీలర్లకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త

డీలర్లందరూ శిక్షణ పొందాలి



విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు వ్యాపారం చేసే ప్రతి డీలరూ ఈ దేశీ శిక్షణ పొందాలి. వ్యవసాయ శాఖలో రిటైర్డ్ ఏడీలు, వివిధ పంటల పరిశోధన స్థానాల శాస్త్రవేత్తల ద్వారా శిక్షణ ఇస్తున్నాం. ఇది వ్యవసాయ విజ్ఞానానికి ఎంతో దోహదపడుతుంది. శిక్షణ కోసం ఆత్మను సంప్రదించాలి.

– వై.జ్యోతిర్మయి, డీపీడీ, ఆత్మ, కాకినాడ

రైతులకు ప్రయోజనం



వ్యవసాయ, ఉద్యాన పంటలు సాగు చేసే రైతుల్లో 70 శాతం మంది డీలర్ల నుంచి, 20 శాతం మంది పక్క రైతుల నుంచి, 10 శాతం మంది వ్యవసాయ శాఖ నుంచి సలహాలు తీసుకుంటున్నారు. డీలర్లకు అనుభవ పూర్వకంగా తప్ప శాస్త్రీయంగా, పరిశోధనాత్మకంగా వ్యవసాయ పరిజ్ఞానం తక్కువ. ఇటువంటి పరిస్థితుల్లో వారిని వ్యవసాయ విజ్ఞానవంతులుగా మార్చాలన్నది ప్రభుత్వ లక్ష్యం. దేశీ డిప్లొమా కోర్సులో శిక్షణ పొందిన డీలర్ల సలహాలు, సూచనలు రైతులకు ఉపయోగపడతాయి.

– వి.భాస్కరరావు, రిటైర్డ్ ఏడీఏ, దేశీ ఫెసిలిటేటర్

శిక్షణతో వ్యవసాయ విజ్ఞానం



డీలర్లు విధిగా దేశీ శిక్షణ తీసుకోవాలని అధికారులు ఎప్పటి నుంచో చెబుతున్నారు. మేమే పెడచెవిన పెడుతూ వచ్చాం. గత ఏడాది అధికారుల ఒత్తిడి మేరకు ఎప్పుడైనా తప్పదని ముందుకు వచ్చాం. ఏడాది పాటు థియరీ, పరిశోధనా కేంద్రాల్లో ప్రాక్టికల్ శిక్షణ ఇచ్చారు. దీని ద్వారా ఎంతో విజ్ఞానం పొందాం. పంటల సాగులో ఎన్నో మెళకువలు తెలుసుకున్నాం. ఈ శిక్షణ ప్రతి డీలరుకూ అవసరమే.

– చీకట్ల ప్రసాద్, ఉపాధ్యక్షుడు, కోనసీమ డీలర్స్ అసోసియేషన్, కొత్తపేట

నయవంచకుడికి పదేళ్ల జైలు

కాకినాడ లీగల్: యువతికి మాయమాటలు చెప్పి, లైంగిక దాడికి పాల్పడి, పెళ్లి చేసుకోవడానికి ముఖం చాటేసిన నయవంచకుడికి పదేళ్ల జైలు, రూ.6 వేల జరిమానా విధిస్తూ కాకినాడ పోక్సో ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి ఎల్.వెంకటేశ్వరరావు మంగళవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. కాకినాడ కొండేలుపేటకు చెందిన కొండేలు సంతోష్ కుమార్ అలియాస్ సోమేష్ అదే ప్రాంతానికి చెందిన యువతిని ప్రేమిస్తున్నానంటూ మాయమాటలు చెప్పాడు. పెళ్లి చేసుకుంటానని నమ్మించి లైంగిక దాడికి పాల్పడ్డాడు. అనంతరం ముఖం చాటేయడంతో బాధితురాలు 2018లో సర్పవరం పోలీసులకు ఫిర్యాదు చేసింది. కోర్టు విచారణలో సోమేష్‌పై నేరం రుజువైంది. లైంగిక దాడికి పాల్పడినందుకు పోక్సో చట్టం 5(1) ప్రకారం పదేళ్ల జైలు, రూ.5 వేల జరిమానా, నమ్మించి మోసం చేసినందుకు ఐపీసీ 417 ప్రకారం ఏడాది జైలు, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. రెండు శిక్షలూ ఏకకాలంలో అనుభవించాలని పేర్కొన్నారు.

ఇతరులకు అన్నదానం.. నో

- ఇకపై భక్తులకే భోజనం
- సిబ్బంది, ఇతరులు చేసే వీలు లేదు
- సత్యదేవుని సన్నిధిలో ఈఓ ఆదేశాలు

అన్నవరం: సత్యదేవుని నిత్యాన్న ప్రసాద పథకం(అన్నదానం)లో ఇకపై భక్తులు మినహా ఇతరులెవ్వరూ భోజనం చేయడానికి వీలు లేదు. ఈ మేరకు అన్నవరం దేవస్థానం ఈఓ ఎస్ఎస్ చంద్రశేఖర్ ఆజాద్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. దీనిపై దేవస్థానంలో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ఉత్తర్వుల్లో ఏమున్నారంటే..

- అన్నదాన పథకంలో ప్రతి రోజూ 500 నుంచి వెయ్యి మంది వరకూ దేవస్థానం సిబ్బంది, షాపుల్లో పని చేసేవారు, ఇతర వ్యాపకాలతో వస్తున్న వారు భోజనం చేస్తున్నట్లు గుర్తించారు. దీనివలన భక్తులు ఇచ్చిన విరాళాలు ఏటా రూ.కోటి వరకూ దుర్వినియోగమవుతున్నట్లు తేలింది. ఇక నుంచి అటువంటి వారు అన్నదాన పథకంలో భోజనం చేయరాదు. భక్తులను మాత్రమే అన్నదాన భవనంలోకి అనుమతించాలి.
- దేవస్థానంలో పని చేసే రెగ్యులర్, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్, శానిటేషన్, సెక్యూరిటీ, ఇతర సిబ్బంది, వివిధ దుకాణాల్లో పని చేసేవారు విధిగా ఇంటి నుంచి భోజనం తెచ్చుకోవాలి.
- ప్రసాద తయారీ విభాగంలో పని చేసే ప్యాకర్లను శని, ఆదివారాలు, పర్వదినాల్లో మాత్రమే భోజనానికి అనుమతిస్తారు.
- దేవస్థానం డోనర్స్ భవనాల నిర్మాణ పనుల్లో పని చేసేవారిని ఇంజినీరింగ్ అధికారుల అనుమతి తీసుకున్నాకే భోజనానికి అనుమతించాలి.
- స్వచ్ఛంద సేవ చేసే వలంటీర్లను అనుమతించాలంటే పీఆర్ఓ అనుమతి తీసుకోవాలి.
- లిఖిత పూర్వక అనుమతి లేకుండా అన్నప్రసాద భవనం నుంచి ఆహార పదార్థాలను బయటకు పంపరాదు.
- అన్నప్రసాదం స్వీకరించే భక్తులు విధిగా నుదిటిన తిలకధారణ చేయాలి.


అన్నదాన పథకంలో భోజనం చేస్తున్న భక్తులు (ఫైల్)

తాజా ఆదేశాలపై అసంతృప్తి

ఈఓ ఆదేశాలపై కొంతమంది హర్షం వ్యక్తం చేస్తున్నారు. రూ.లక్ష జీతం తీసుకునే ఉద్యోగులు కూడా అన్నదానంలోనే భోజనం చేస్తున్నారని కొంతమంది వ్యాఖ్యానించారు. అయితే, తాము భోజనాలు చేయకూడదనే ఆదేశాలపై కొంతమంది సిబ్బంది అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అన్నదానం ప్రారంభించినప్పటి నుంచి అంటే సుమారు 30 సంవత్సరాలుగా దేవస్థానంలో పని చేస్తున్న కొంతమంది నాలుగో తరగతి సిబ్బంది ఇక్కడే భోజనం చేస్తున్నారు. అలాగే, ఇతర దేవస్థానాల నుంచి బదిలీ అయి వచ్చిన వారు, సెక్యూరిటీ, శానిటేషన్ విభాగాల సిబ్బందిలో కొంత మంది కూడా భోజనాలు చేస్తున్నారు. వీరందరూ వంద మందికి మించి ఉండరు. వీరందరూ తెల్లవారుజామున విధులకు హాజరై, సాయంత్రం వరకూ పని చేస్తారు. తమను అన్నదానంలో భోజనం చేయవద్దని నియంత్రించడంపై వీరు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఈ నిర్ణయాన్ని పునః పరిశీలించాలని ఈఓను కోరుతున్నారు.

సత్యదేవుని అన్నదాన పథకం వివరాలు

విరాళాలు: రూ.20 కోట్లు
వీటిపై ఏటా వచ్చే వడ్డీ: సుమారు రూ.3.5 కోట్లు
ఏటా వచ్చే విరాళాలు రూ.3 కోట్లు
రోజూ భోజనాలు చేస్తున్న భక్తులు: 4 వేలు
భోజనాలకు ఏటా అయ్యే ఖర్చు: రూ.4.32 కోట్లు
ఏడాదికి ఒక భక్తునికి భోజనం పెట్టేందుకు అయ్యే ఖర్చు: రూ.10,950

ఆత్మగౌరవంతోనే మనసుకు సంతోషం



డీఈఓ కార్యాలయంలో జరిగిన సదస్సులో మాట్లాడుతున్న సర్వేశ్వరశర్మ

ముమ్మిడివరం: మనస్సుకు సంతోషాన్ని కలిగించే లేపనం వంటిది ఆత్మగౌరవమని కోనసీమ సైన్స్ పరిషత్ అధ్యక్షుడు సీవీ సర్వేశ్వరశర్మ అన్నారు. ముమ్మిడివరం డీఆర్‌డీఏ కార్యాలయ ఆవరణలో పీడీ వి.శివశంకర ప్రసాద్ అధ్యక్షతన మంగళవారం జరిగిన పరిషత్ 2,852వ మహాసభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఒక్కొక్కరిలో ఒక్కో రకమైన ప్రతిభ దాగి ఉంటుందని, దీనిని ఎవరికి వారే గమనించుకోవాలని చెప్పారు. మనిషి బుద్ధి చాతుర్యతను పెంచే ఆయుధం మనస్సు అని అన్నారు. సమస్యలను ధైర్యంగా ఎదుర్కొని కొత్త ఆలోచనలతో నూతన మార్గాలను అన్వేషించడం మొదలు పెడితే గెలుపు సొంతమవుతుందని చెప్పారు. అలాగే జిల్లా విద్యా శాఖాధికారి కార్యాలయంలో డీఈఓ ఎం.కమలకుమారి అధ్యక్షతన జరిగిన మరో సభలో కూడా సర్వేశ్వర శర్మ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మనిషి ఊహకు, ఉత్పత్తికి సంబంధముందని, దీనికి కావలసిన ఆత్మవిశ్వాసం ఉంటే సృజనాత్మకత పెరుగుతుందని చెప్పారు. సమావేశంలో ఏపీడీ ఎంఎం జిలానీ, డీపీఎం అన్నపూర్ణ, అసిస్టెంట్ డైరెక్టర్ ఎం.విజయలక్ష్మి, ఎస్.సురేష్ పాల్గొన్నారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

సీతానగరం: గోదావరిలో కొట్టుకుపోతున్న ఇద్దరిని స్థానికులు రక్షించారు. వారి కథనం ప్రకారం.. సింగవరం అంబేద్కర్ నగర్‌కు చెందిన ఒక బాలుడు మరణించాడు. అతడి మృతదేహాన్ని బంధువులు, స్నేహితులు వంగలపూడి ఇసుక ర్యాంపు వద్ద మంగళవారం ఖననం చేశారు. అనంతరం గోదావరిలో స్నానాలు చేయడానికి వెళ్లారు. వీరిలో కోడెల్లి శ్రీను, మానెల్లి భాస్కరరావు ఉధృతంగా ప్రవహిస్తున్న గోదావరిలో కొట్టుకుపోయారు. గమనించిన మిగిలిన వారు భయంతో కేకలు వేశారు. వీరిలో స్నానాలు చేస్తున్న మణి, లక్ష్మణ్, అంబటి పండు వెంటనే ఈదుకుంటూ వెళ్లి, కొట్టుకుపోతున్న వారి వద్దకు చేరుకున్నారు. అక్కడే జాలర్ల నాటు పడవ ఉండటంతో కొంత మంది దానిపై వెళ్లి గోదావరిలో కొట్టుకుపోతున్న శ్రీను, భాస్కరరావులను ఒడ్డుకు చేర్చారు. దీంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.


గోదావరిలో కొట్టుకుపోతున్న వారిని రక్షించి, ఒడ్డుకు చేర్చుతున్న దృశ్యం

ఉన్నత్ భారత్ అభియాన్‌పై వర్క్‌షాప్



ఉన్నత భారత్ అభియాన్‌పై వివరిస్తున్న విద్యార్థులు, అధ్యాపకులు

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): ఉన్నత్ భారత్ అభియాన్‌పై యూబీ సెల్ ఆధ్వర్యాన ప్రగతి ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం వర్క్‌షాపు నిర్వహించారు. కళాశాల చైర్మన్ డాక్టర్ పరుచూరి కృష్ణారావు మాట్లాడుతూ, దేశ అభివృద్ధిలో యువతను భాగస్వాముల్ని చేసేందుకు కేంద్ర మానవ వనరుల శాఖ ఈ కార్యక్రమం చేపట్టిందని అన్నారు. తమ కళాశాల సమీపాన ఉన్న గ్రామాల అభివృద్ధికి యూబీ సెల్ కృషి చేస్తుందన్నారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఉన్నత్ భారత్ అభియాన్ రీజినల్ కోఆర్డినేటర్ డాక్టర్ బి.పావని యూబీఏ ఆశయాలు, లక్ష్యాలను వివరించారు. ఉన్నత విద్య చదువుతున్న విద్యార్థులు తమ సమీప గ్రామాల్లోని సమస్యను విశ్లేషించి, పరిష్కారాన్ని సూచించడం ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని చెప్పారు. నీటి వనరుల వినియోగంపై ఏఎస్‌డీ మహిళా కళాశాల అర్థశాస్త్ర అధ్యాపకులు జి.పావనీదేవి వివరించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ (మేనేజ్‌మెంట్)ఎంవీ హరినాథబాబు, వైస్ ప్రెసిడెంట్ ఎం.సతీష్, డైరెక్టర్ శంభుప్రసాద్, ప్రిన్సిపాల్ సత్యనారాయణ, వైస్ ప్రిన్సిపాల్ నరేష్, యూబీఏ కో ఆర్డినేటర్ ఫణి భాస్కర్, వివిధ విభాగాధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

18 నుంచి ఉమ్మడి ఏపీ షటిల్ టోర్నమెంట్

అమలాపురం టౌన్: స్థానిక ఆఫీసర్స్ క్లబ్ ఇన్‌డోర్ కోర్టులో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ షటిల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ ఈ నెల 18వ తేదీ నుంచి మూడు రోజుల పాటు నిర్వహిస్తున్నారు. కోనసీమ షటిల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రతినిధులు మెట్ల రమణబాబు, అల్లాడ శరత్‌బాబు ఈ విషయం తెలిపారు. అంతర్జాతీయ షటిల్ బ్యాడ్మింటన్ క్రీడాకారుడు రంకిరెడ్డి సాత్విక్ సాయిరాజ్ సూచనలతో ఉభయ తెలుగు రాష్ట్రాల స్థాయి టోర్నమెంట్ నిర్వహిస్తున్నామని చెప్పారు. స్థానిక ఆఫీసర్స్ క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఈ వివరాలు తెలిపారు. మెన్స్ డబుల్స్, వెటరన్స్ డబుల్స్ విభాగాల్లో ఈ పోటీలు జరుగుతాయన్నారు. మెన్స్ డబుల్స్ విన్నర్‌కు రూ.50 వేలు, రన్నర్‌కు రూ.30 వేలు, తృతీయ బహుమతిగా రూ.20 వేలు, నాలుగో స్థానంలో నిలిచిన వారికి రూ.10 వేల చొప్పున నగదు బహుమతులు అందజేస్తామని టోర్నమెంట్ నిర్వాహకుడు, విశ్రాంత ఫిజికల్ డైరెక్టర్ రంకిరెడ్డి కాశీ తెలిపారు. వెటరన్స్ డబుల్స్‌లో విన్నర్‌కు రూ.30 వేలు, రన్నర్స్‌కు రూ.20 వేల చొప్పున నగదు బహుమతులు అందజేస్తామని చెప్పారు. సాధనాల శ్రీనివాసరావు మెమోరియల్ పేరిట నిర్వహిస్తున్న ఈ టోర్నమెంట్ ప్రచార పోస్టర్లను అసోసియేషన్ ప్రతినిధులు విడుదల చేశారు. కార్యక్రమంలో సాత్విక్ సాయిరాజ్ తల్లిదండ్రులు రంకిరెడ్డి కాశీ, రంగమణి, అసోసియేషన్ ప్రతినిధులు డాక్టర్ పీఎస్ శర్మ, యాళ్ల నాగ సతీష్, ప్రొఫెసర్ గోకరకొండ నాగేంద్ర, కల్వకొలను బాబు, నల్లా శివ, వంటెద్దు బాబీ, చిక్కం శ్రీను తదితరులు పాల్గొన్నారు.

కక్ష కట్టి.. కడతేర్చారు

- మహేంద్రవాడ హత్య కేసును ఛేదించిన పోలీసులు
- ఇద్దరు నిందితుల అరెస్టు
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ కిషోర్ కుమార్


హత్య కేసు వివరాలను వెల్లడిస్తున్న డీఎస్పీ కిషోర్ కుమార్

అనపర్తి: మండలంలోని మహేంద్రవాడ తూర్పు పుంతలో గత నెల 30న వెలుగు చూసిన సత్తి నారాయణ రెడ్డి హత్య కేసు మిస్టరీని పోలీసులు ఛేదించారు. ఇద్దరు నిందితులను అరెస్టు చేశారు. స్థానిక సీఐ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో రాజమహేంద్రవరం తూర్పు మండలం డీఎస్పీ ఎం.కిషోర్ కుమార్ ఈ వివరాలు వెల్లడించారు. ఆయన కథనం ప్రకారం.. మహేంద్రవాడకు చెందిన నారాయణరెడ్డి తాపీ మేస్త్రిగా జీవించేవాడు. అతడి వద్ద అదే గ్రామానికి చెందిన కర్రి నాగిరెడ్డి కొంత కాలం నుంచి పని చేస్తున్నాడు. ఈ క్రమంలో తరచూ నాగిరెడ్డి ఇంటికి వెళ్లే నారాయణరెడ్డి.. నాగిరెడ్డి భార్యపై కన్ను వేశాడు. కోరిక తీర్చాలని వేధించేవాడు. విషయాన్ని ఆమె భర్త నాగిరెడ్డికి చెప్పింది. ఈ నేపథ్యంలో నారాయణరెడ్డిపై కక్ష పెంచుకున్న నాగిరెడ్డి.. అతడిని అంతం చేయాలని నిర్ణయించుకున్నాడు. ఈ నేపథ్యంలో ముందుగా వేసుకున్న పథకం ప్రకారం.. గత నెల 29వ రాత్రి నారాయణరెడ్డికి ఫోన్ చేసి, మద్యం తాగుదామని పిలిచాడు. వెంట తెచ్చుకున్న స్టీల్ రాడ్డుతో అక్కడకు వచ్చిన నారాయణరెడ్డి తల వెనుక భాగంలో పలుమార్లు కొట్టి హతమార్చాడు. ఈ హత్యలో నాగిరెడ్డి కుమారుడు (మైనర్) కూడా భాగం పంచుకున్నాడు. హతుడి కాల్ డేటా ఆధారంగా పోలీసులు ఈ కేసుపై ముమ్మర దర్యాప్తు చేపట్టారు. గత నెల 30వ తేదీ నుంచి నాగిరెడ్డి గ్రామంలో లేడని గుర్తించి, నిఘా పెట్టారు. విషయం తెలుసుకుని భయపడిన ముద్దాయి, అతడి కుమారుడు మహేంద్రవాడ సచివాలయం వీఆర్ఓ ఎదుట మంగళవారం లొంగిపోయారు. నిందితులు హత్యకు ఉపయోగించిన ఆయుధాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసును అన్ని కోణాల్లోనూ దర్యాప్తు చేసి, త్వరితగతిన ఛేదించిన సీఐ వి.శ్రీనివాస్, ఎస్సై పి.అప్పారావుతో పాటు ఏఎస్సై వీర్రాజు, హెడ్ కానిస్టేబుళ్లు పి.రఘు, ఐ.శ్రీనివాసరావు, కానిస్టేబుళ్లు తమ్మారావు, త్రిమూర్తులు, దుర్గాప్రసాద్‌లను జిల్లా ఎస్పీ అభినందించి, ప్రశంసా పత్రాలు అందజేశారని డీఎస్పీ తెలిపారు.

వ్యసనాలకు బానిసలై.. చోరీల బాట


స్వాధీనం చేసుకున్న మోటార్ సైకిళ్ల వద్ద అడిషనల్ ఎస్పీ ఖాదర్‌బాషా తదితరులు

- ముగ్గురు మోటార్ సైకిళ్ల దొంగల అరెస్టు
- 30 బైక్‌లు స్వాధీనం

రామచంద్రపురం: మోటార్ సైకిళ్ల చోరీకి పాల్పడుతున్న ముగ్గురిని పోలీసులు మంగళవారం రామచంద్రపురంలో అరెస్టు చేశారు. రామచంద్రపురం పట్టణ పోలీస్ స్టేషన్లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అడిషనల్ ఎస్పీ ఎస్.ఖాదర్‌బాషా ఈ వివరాలు వెల్లడించారు. జూలై 27వ తేదీన రామచంద్రపురం మెయిన్ రోడ్డులోని కోస్టల్ బ్యాంకు వద్ద ఒక మోటార్ సైకిల్ చోరీ అయ్యింది. ఆ వాహన యజమాని ఫిర్యాదు మేరకు రామచంద్రపురం పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు ప్రారంభించారు. జిల్లా ఎస్పీ ఎస్.శ్రీధర్ ఆదేశాల మేరకు ఇటీవల చోరీకి గురైన వాహనాలను గుర్తించేందుకు రామచంద్రపురం డీఎస్పీ టీఎస్ ఆర్‌కే ప్రసాద్ ఆధ్వర్యాన జిల్లా సీసీఎస్ సీఐ డి.గోవిందరావు, ఎస్సై డీబీ సంపత్, హెడ్‌కానిస్టేబుల్ నాగేశ్వరరావు ఒక బృందంగా.. రామచంద్రపురం సీఐ వి.దుర్గారావు, ఎస్సై డి.సురేష్‌బాబు, హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్, కానిస్టేబుల్ టి.సూరిబాబు మరో బృందంగా ముద్దాయిల ఆచూకీ కోసం దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో బైపాస్ రోడ్డులోని కొత్తూరు వద్ద కోస్టల్ బ్యాంక్ వద్ద చోరీకి గురైన మోటార్ సైకిల్‌పై ముగ్గురు వెళ్తుండగా పోలీసులు పట్టుకున్నారు. వారిని ప్రశ్నించగా పట్టణానికి చెందిన గోరస శ్రీనివాస్, వడగన శంకర్ దుర్గ, వెల్ల గ్రామానికి చెందిన శీలి అనిల్‌గా గుర్తించారు. ఈ ముగ్గురూ స్నేహితులుగా ఉంటూ, చెడు వ్యసనాలకు బానిసలై, మోటార్ సైకిళ్ల చోరీలకు పాల్పడుతున్నారని అన్నారు. వీరు ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని రామచంద్రపురం, మండపేట, రాయవరం, పామర్రు, అన్నవరం, రాజమహేంద్రవరం, కాకినాడ, సర్పవరం, పోలీస్ స్టేషన్ల పరిధిలో మోటార్ సైకిళ్లు దొంగిలించినట్టు పోలీసుల విచారణలో తేలింది. వీరి నుంచి 30 బైక్‌లు స్వాధీనం చేసుకున్నారు. చోరీ కేసును ఛేదించిన పోలీసు సిబ్బందిని జిల్లా ఎస్పీ శ్రీధర్ అభినందించారు.